క్లుప్తంగా

మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి



వీవోఏలకు సూచనలిస్తున్న ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని ఎంపీపీ బొంగు సురేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీవో ఏలు, మహిళా మండలి సభ్యులతో ఎంపీపీ బొంగు సురేష్ మంగళవారం సమావేశమై, కాసేపు మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను వివరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మన పని మనం చేసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మణరావు, కాద రామకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ పల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి బాధ్యత హెచ్ఎంలదే..

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈఓ ఆర్.ఆనందరావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించాచారు. పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, సమస్యలపై ఆరా తీశారు. వంటలు రుచికరంగా ఉండేలా చూడాలని, మెనూ కచ్చితంగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: భామినిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ ఎం.విజయనిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులంలోని 6,7,8,9 తరగతులలో 74 సీట్లు ఖాళీ ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 26న విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా గురుకులంలో సంప్రదించాలని సూచించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై ఎన్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. పాలకొండ-వీరఘట్టం రహదారిలో మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్న మైనర్లకు పలు సూచనలు చేశారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇస్తే కేసులు నమోదు చేస్తామన్నారు వాహన యజమానులను హెచ్చరించారు. వాహనం నడపటంపై అవగాహన లేక, మితిమీరిన వేగంలో మైనర్లు పలు రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈ క్రమంలో వాహన యజమానులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహన ధ్రువపత్రాలు లేని చోదకులకు అపరాదరుసుం విధించారు.

దుమ్ము, ధూళితో ఇబ్బంది

భామిని: మండలంలోని ఏబీ రోడ్డులో భారీ లారీల రాకపోకలు పెరగడంతో ఈ రోడ్డులో దుమ్ము, ధూళి రేగుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి నిత్యం భారీగా లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఈ ప్రాంత ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

27న ఆశీల వేలం పాట

పార్వతీపురంటౌన్: ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించి పార్వతీపురం పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న రోజువారీ మార్కెట్, రోడ్డు మార్జిన్, కబేళాల నందు ఆశీలు వసూలు చేసుకునే హక్కు కల్పించేందుకు బహిరంగ వేలం వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 27న ఉదయం 12గంటలకు పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సదరు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు కార్యాలయం పని వేళలో సంప్రదించవచ్చని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

సీతానగరం: పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధనతో పాటు వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఈఓ జి.పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం వంటలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో పాఠ్యాంశాల బోధన పూర్తిచేయాలని, చదువులో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిర్దేశిత మెనూ ప్రకారం భోజనాలు వండి పెట్టాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు సూచించారు. పాఠశాలలో టీఎల్ఎం విధానం ద్వారా పలుఅంశాలను ఉపాధ్యాయులు పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

- అతిసార నియంత్రణపై రెండు నెలల పాటు విస్తృత ప్రచారం
- అధికారులకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచన



తాగునీటిని పరీక్షిస్తున్న వైద్యులు



చేతులను శుభ్రం చేయిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

పార్వతీపురం: వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. సమస్య వచ్చిన తరువాత ఆస్పత్రుల చుట్టూ పరుగులు తీసేకన్నా ముందస్తు జాగ్రత్తలే శ్రీరామరక్ష అని వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండలు, అకస్మాత్తుగా వానలు కురిసి వాతావరణం చల్లబడడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితి పొంచి ఉంది. ఇటీవల డయేరియా(అతిసారం) విజృంభిస్తోంది. దీనికి సకాలంలో చికిత్స అందించకపోతే ఒక్కోసారి ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు.

డయేరియా లక్షణాలు..

- నీళ్ల విరోచనాలు వస్తే డయేరియాగా అనుమానించాలి.
- రెండుమూడు విరోచనాలు అయినా, ఇతర లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- శరీరంనుంచి అధిక మొత్తంలో నీరు బయటకు పోవడంవల్ల వయస్సుతో సంబంధం లేకుండా డీ హైడ్రేషన్ కలుగుతుంది. దీనివల్ల పిల్లలు, వృద్ధులకు ఎక్కువగా ప్రమాదం జరుగుతుంది.
- డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు అశ్రద్ధ చేస్తే నాడి వేగంగా, బలహీనంగా కొట్టుకోవడం లేదా ఒక్కోసారి నాడి తెలియకపోవడం జరుగుతుంది.

'ఎందుకు వస్తుందంటే..

- కలుషిత నీరు, కలుషిత ఆహారం వల్ల డయేరియా వస్తుంది. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం వల్ల వ్యాధికారక క్రిములు జీర్ణ వ్యవస్థలోకి ప్రవేశించి, నీళ్ల విరోచనాలు వస్తాయి.
- అపరిశుభ్రత కారణంగా కూడా ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉంది.

నివారణ..

- పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి.
- చేతులను తరచూ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- బయట ఆహారం తినడం మంచిది కాదు
- ఉడకని మాంసం తినకూడదు
- కాచి చల్లార్చిన నీటిని వడబోసి తాగాలి
- శీతల పానీయాలు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి

చేతుల శుభ్రతపై అవగాహన

జిల్లాలో చేతుల శుభ్రతపై అంగన్వాడీ కేంద్రం, పాఠశాలల్లో చిన్నారులకు మంగళవారం అవగాహన కల్పించి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. శుభ్రత, వ్యక్తిగత పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లు, ఆహార పదార్థాలు విక్రయించే స్థలాలు, మురికివాడలు, తాత్కాలిక నివాసాలు ఉంటున్న వారిపై ప్రత్యేక దృష్టిసారించేలా అవగాహన కల్పిస్తున్నారు.

చర్యలు ముమ్మరం

- జిల్లాలో డయేరియా, మలేరియా, డెంగీ, తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రణాళికను సిద్ధం చేశారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో అంగన్వాడీ, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, జూలై 1నుంచి ఇంటింటికీ వెళ్లి గుర్తించిన చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ సప్లిమెంటరీ మాత్రలు అందజేయనున్నారు. అనుబంధ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పరిసరాల పరిశుభ్రత, శుద్ధమైన తాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయనున్నారు. డయేరియా నివారణపై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ మేరకు జూలై 1 నుంచి ఆగస్టు 31వరకు రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అవసరమైనప్పుడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేలా సిబ్బందిని కలెక్టర్ అప్రమత్తం చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

గుమ్మలక్ష్మీపురం: ఆస్పత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వైద్యులకు సూచించారు. మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, ఓపీ రికార్డులు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, మందులుపై ఆరాతీశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిని ఆశ్రయించే వారిని బాగా చూసుకోవాలని, సకాలంలో వారికి చికిత్స అందేలా చూడాలని తెలిపారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని సిబ్బందికి తెలిపారు. అనంతరం రోగుల వద్దకు వెళ్లి, వారికి అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పోలూరు శ్రీను, వెంపటాపు భారతి తదితరులు ఉన్నారు.



భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నీతిఅయోగ్ సూచనలు కచ్చితంగా అమలు చేయాలి

భామిని:

నీతిఅయోగ్ సూచనలను కచ్చితంగా అమలు చేయాలని ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్, ఏస్పరేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ కె.మహేశ్వరరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆశావహ సమితుల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. హెల్త్, న్యూట్రిషియన్, విద్య, వ్యవసాయం, సోషల్ డిమాలిస్ వంటి అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. సమావేశంలో ఈఓఆర్డీ కృష్ణారావు, వైద్యాధికారి డాక్టర్ పి.సోయల్, ఎంఏఓ కిమిడి మన్మథరావు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖరనాయుడు, ఎంఈఓ ఎ.శ్రీనివాస్, ఐసీడీఎస్ ఎస్ఓ వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అమరాన సందీప్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

చేతుల పరిశుభ్రతపై అవగాహన

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెదగుడబ, రావివలస ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు చేతుల పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది చేతులు ఏవిధంగా శుభ్రం చేసుకోవాలో, చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా కలిగే మేలును వివరించారు. అన్నం తినే ముందు తిన్న తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. కార్యక్రమంలో గరుగుబిల్లి సచివాలయం ఏఎన్ఎం బి.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సి.హెచ్.గౌరమ్మ, పి.కృష్ణవేణి, ఆర్.పద్మ, ఎం.స్వాతి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో చేతులు పరిశుభ్రం చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఫైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ



శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువత

సీతంపేట: ఫైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై గిరిజన యువతకు శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస కృషీ విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల వృత్తి శిక్షణ ఇస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో అడ్డంగి, కొండూర గ్రామాల నుంచి 20 మంది గిరిజన యువతను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తున్నట్టు గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత తెలిపారు. ఫైనాపిల్‌లో ఉండే ఆస్కార్బిక్ ఆమ్లం, పీచు పదార్థాలు రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంతో పాటు జీర్ణక్రియ సక్రమంగా జరిగేలా చూస్తాయన్నారు. క్యాన్సర్‌ను నియంత్రించే కారకాలు ఫైనాపిల్‌లో పుష్కలంగా ఉంటాయన్నారు. జూన్ నుంచి ఆగస్టు వరకు ఫైనాపిల్ పంట దిగుబడి ఉంటుందని, ఫైనాపిల్ నుంచి జామ్, స్క్వాస్, క్యాండీ, తదితర ఉత్పత్తుల తయారీపై గిరిజన యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. దీని వల్ల యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.నీలవేణి, వి.హరికుమార్, అనూష, ఎస్.కిరణ్ కుమార్, వెలుగు అసోసియేషన్ ప్రతినిధులు ఆనందరావు, వసంత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్) బ్రాంచి మేనేజర్‌గా వి.వి.ఆర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గరుగుబిల్లి బ్రాంచి నుంచి బదిలీపై తోటపల్లి బ్రాంచికు వెళ్లారు. ఖాతాదారులు, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం విద్యుత్ ఉప కేంద్రంలో ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు పాలకొండ ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఉపకేంద్రం పరిధిలో పొట్టిలి, ఎం.సింగుపురం, మల్లివీడు, డోలమడ, బడ్డుమాసింగి, జంపరకోట, అవలంగి, పనుకువలస, అట్టలి, తుమరాడ, చింతాడ, వాటపాగు, టీకే.రాజపురం, దుగ్గి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

త్వరితగతిన సోక్‌ఫిట్‌ల నిర్మాణం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: త్వరితగతిన కమ్యూనిటీ సోక్‌ఫిట్‌ల నిర్మాణం చేయాలని ఎంపీడీఓ కె.గీతాంజలి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. భూగర్భ జలాలను పెంచేందుకు ఈ సోక్‌ఫిట్‌లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



సాలూరు రూరల్: మండలంలోని తోణాం కొత్తవలస, బొర్రమామిడివలస గ్రామాలకు విద్యుత్ సరఫరా లైన్లు ప్రమాదభరితంగా ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ విద్యుత్ లైన్లు పామాయిల్ తోట లోపలి నుంచి ఉండడంతో చిన్నగాలి వేసిన కొమ్మలు వైర్లపై పడి కరెంటు సరఫరా ఆగిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి వేసిందంటే రెండు గ్రామాల ప్రజలు చీకటిలో ఉండాల్సిందేనని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన రెండుమూడు రోజుల వరకు అందుబాటులోకి రావడంలేదని చెబుతున్నారు.

వైద్య పరికరాల వితరణ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వైటీసీలో గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహంలోని గర్భిణులకు అవసరమైన వైద్య పరికరాలను గరుగుబిల్లి మండలం, కొత్తూరు జనసేన పార్టీ నాయకుడు ఏగిరెడ్డి తిరుపతినాయుడు వితరణ చేశారు. ఆ పార్టీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.మల్లేశ్వరరావుతో కలిసి వైటీసీ మేనేజర్ ఎస్.రాముకు వాటిని మంగళవారం అందజేశారు. బీపీ పరీక్షించే పరికరంతో పాటు పల్స్‌ఆక్స్ మీటర్‌ను కూడా అందించామని, అలాగే అక్కడి గర్భిణులకు పండ్లు, రొట్టెలు కూడా ఇచ్చామని దాత తెలిపారు. గర్భిణుల వసతి గృహంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ ఉండేలా ఇన్వర్టర్‌లు కూడా అందిస్తామన్నారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు అనీల్, శంకరరావు తదితరులు ఉన్నారు.



గర్భిణులకు రొట్టెలు, పండ్లు అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

'ఉపాధి' పనుల అక్రమాలపై విచారణ

జియ్యమ్మవలస: మండలంలోని కుందరతిరువాడ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరిగాయని వెల్లువెత్తిన ఆరోపణలపై ఏపీవో శ్రీనివాసరావు మంగళవారం విచారణ చేపట్టారు. ఉపాధి పనుల వేతనదారులతో సమావేశమై, ఆరోపణలు నిజమా.. కాదా.. అని ఆరాతీశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలో గ్రామంలో ఈ విచారణ చేపట్టినట్లు సమాచారం.



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీవో శ్రీనివాసరావు

ఘనంగా గ్రామదేవత పండగ

కురుపాం: పైడిమారమ్మ గ్రామదేవత పండగ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా అమ్మవారికి చీరలు, సారెలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం చల్లగా ఉండేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. అంతకుముందు అమ్మవారి ఒంటిఘటం ఊరేగించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తుల్లో కొంతమంది వేసిన ఆంజనేయుడు, కృష్ణుడు, శివుడు, చిత్రగుప్తుడు వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి.



ఆకట్టుకున్న గ్రామస్తుల వేషధారణలు

జీవో నంబర్ 117ను రద్దు చేయండి

జియ్యమ్మవలస: జీవో నంబర్ 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్రాపు మహేష్, బాలకృష్ణలు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దబుడ్డిడి గ్రామంలో మంగళవారం జరిగిన ఏపీటీఎఫ్ మండల సబ్ కమిటీ సమావేశానికి హాజరైన వారు.. ఉపాధ్యాయ సమస్యలు-పరిష్కార మార్గాలపై చర్చించారు. ఉపాధ్యాయులపై అదనపు భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, కార్యదర్శి కొర్లాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు

వినూత్న నిరసన

కొమరాడ: పార్వతీపురం-కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారి మరమ్మతులు తక్షణమే చేపట్టాలని సీపీఎం నేత కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రానికి సమీపంలో రహదారిలో ఏర్పడిన భారీగుంతలోని మురుగునీటిలో శరీరానికి టేకుఆకులు కట్టుకుని, ఈతకొట్టి వినూత్నంగా నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే మార్గంలోని రహదారి చాలా అధ్వానంగా తయారైందని, ఇదే సమస్యను ఆర్అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పొడవునా ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మూడు రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలు ఇదే రహదారిలో నిత్యం వస్తూ, వెళ్తుండడంతో రహదారి దారుణంగా తయారైందన్నారు. రోడ్డు బాగాలేని కారణంగా ట్రాఫిక్ సమస్యలు కూడా ఎక్కువవుతున్నాయన్నారు. ఇప్పటికైనా రహదారి మరమ్మతులు చేపట్టేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.



మురుగునీటిలో టేకుఆకులు కట్టుకుని, ఈదుతూ నిరసన తెలియజేస్తున్న సీపీఎం నేత సాంబమూర్తి

చెక్‌డ్యాం బాగుచేయరూ..

సీతంపేట: చిన్నబగ్గ పరిసర గ్రామాల్లో పంటలకు ఆధారమైన చెక్‌డ్యాం పూర్తిగా పాడైంది. దీన్ని మరమ్మతులు చేసి సాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ చెక్‌డ్యాం కింద సుమారు 200 ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉంది. డ్యాం సైడ్‌వాల్ పాడవడంతో నీరు నిల్వ ఉండడం లేదని రైతులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన చెక్‌డ్యాం

సచివాలయాల్లో పూర్తిస్థాయి సేవలు

పాలకొండ రూరల్: గ్రామ సచివాలయాల్లో అర్హత ఉన్న ప్రతీవారికి పూర్తిస్థాయి సేవలు అందేలా విధులు నిర్వహించాలని పాలకొండ ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సూచించారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందించాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన ఫీజును వెంటనే ఆన్‌లైన్ పోర్టల్‌లో కట్టాలన్నారు. పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో ఎక్కడా తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలి

పాలకొండ: రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ వరహాలు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వీఆర్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా రెవెన్యూ సమస్యలపై సమీక్ష నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ భవనాలు వంటి ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాలన్నారు. ప్రజలకు రెవెన్యూ సర్వీసులు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ వరహాలు

వైన్‌షాపును తరలించండి

వీరఘట్టం:

మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ఉన్న వైన్‌షాపును వేరొక చోటుకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు వెళ్లే బాలికలు, మార్కెట్‌కు వెళ్లే మహిళలు, సచివాలయానికి వివిధ పనులపై వచ్చే మహిళలు ఈ వైన్‌షాపు మీదుగా రావాల్సి ఉండటంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మందుబాబులతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో మహిళలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్సైజ్, పోలీసు అధికారులు దీనిపై విచారణ చేసి వైన్‌షాపును ఇక్కడ నుంచి తరలించాలని మహిళలు కోరుతున్నారు.



కొత్త బస్టాండ్ వద్ద ఉన్న వైన్‌షాపు ఇదే..